క్లుప్తంగా

హాకీ టోర్నీ విజేతకు అభినందనలు



స్నేహ ముర్మును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వివేకానందరావు, తదితరులు

పెదగంట్యాడ:నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని ఈ నెల 29న నగరంలోని తాటిచెట్లపాలెం రైల్వే న్యూ కాలనీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన హాకీ టోర్నమెంట్‌లో ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సత్తా చాటింది. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న స్నేహ ముర్ము ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు కళాశాలలో శనివారం ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నాణ్యత ఉంటేనే ఆహార ఉత్పత్తుల ఎగుమతి



బయోఫ్యాక్ట్ రీసెర్చ్ ల్యాబ్ సిబ్బందితో దాస్ జోషి

గాజువాక: ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ప్రపంచమార్కెట్‌లో నాణ్యత, ఆహారభద్రత పోటీతత్వంగా మారాయని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఏపీ దాస్ జోషి అన్నారు. గాజువాక ఆటోనగర్‌లోని బయోఫ్యాక్ట్ రీసెర్చ్ లేబొరేటరీని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడి వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. బయోఫ్యాక్ట్‌లో ఆహార పదార్థాలను పరీక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల భద్రత, ప్రజారోగ్యం దృష్ట్యా ఆహార భద్రతతా నియంత్రణ సంస్థ సూచించిన పరిమితులకనుగుణంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బయోఫ్యాక్ట్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో చిరంజీవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

దాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మేడ్ స్కిల్స్ సంయుక్తంగా గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా తమ సంస్థను లేదా 93816 67986, 72079 53919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాధితులకు బాసటగా న్యాయ సేవాధికార సంస్థ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

మహారాణిపేట: లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, ఆర్థిక సాయం, న్యాయ సహాయం, పునరావాస చర్యల కోసం పనిచేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డ్వాక్రా సంఘాల సమన్వయ అధికారి కె.వి.రామలక్ష్మి, ఈవో బి.సురేష్‌కుమార్, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ పిలుస్తోంది

బాల మేధావులకు చక్కని అవకాశం | సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్టును ప్రదర్శించిన విద్యార్థులు (ఫైల్)

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టే సమయం ఆసన్నమైంది. వారిలో సృజనను, విజ్ఞానాన్ని చాటి చెప్పేందుకు ఇన్‌స్పైర్ మనక్-2025 వేదిక కానుంది. కేంద్ర, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తోంది. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను బయటకు తీయడంతో పాటు సైన్స్‌పై వారిలో ఆసక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నుంచి కొత్త ప్రాజెక్టులకు ఆహ్వానం పలుకుతున్నారు.

ఉన్నత పాఠశాలలకు అవకాశం

ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో పాటు వారికి బోధన సాగించే ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్-2025లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల దీనికి అర్హులు. ప్రతి తరగతి నుంచి ఒకరు చొప్పున ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు మూడు, ఉన్నత పాఠశాలలకు ఐదు ప్రాజెక్టులు ప్రజెంట్ చేసే వెసులు బాటు కల్పిస్తున్నారు.

ప్రాజెక్టులు ఎలా పంపాలి

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్.డీఎస్‌టీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా వచ్చే నెల 15వ తేదీలోగా ప్రాజెక్టులు పంపాలి. అలాగే ఈ వెబ్‌సైట్‌లో విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టు వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వారు తయారు చేసే ప్రాజెక్టులను ప్రజెంట్ చేసే అవకాశం కల్పిస్తారు. జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలో సత్తా చాటే ప్రాజెక్టులకు రూ.10వేల పారితోషికం అందజేస్తారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకూ తమ ప్రాజెక్టును మెరుగు పర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన తదితర అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయి ఎంపికైన ప్రాజెక్ట్‌కు పేటెంట్ లభించే అవకాశం ఉంది.

ఇవీ నిబంధనలు

ముందుగా పాఠశాలల్లో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యలను ఎత్తి చూపించే విధంగా ఆలోచనలు ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి, దానికి అవసరమైన ప్రాజెక్ట్‌ను రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన బ్యాంక్ ఖాతా, ఆధార్ నెంబర్లను ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్ట్ సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపరచి సబంధిత రైటప్‌తో వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ప్రాజెక్ట్ పేరు, శాస్త్ర సాంకేతికకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్ట్‌ను రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్ట్‌కు ప్రయోగం నిమిత్తం రూ.10వేలు జమ చేస్తారు. సెప్టెంబర్ 15లోగా ఈ ప్రాజెక్టులను నమోదు చేయాలి.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఉన్నత పాఠశాలల్లో పని చేసే సైన్స్ ఉపాధ్యాయులందరూ విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రోత్సాహం అందించాలి. వారిలో ఉన్న ప్రతిభకు పదును పెట్టి జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించేలా తీర్చిదిద్దాలి. ప్రాజెక్టుల రూప కల్పన విషయంలో విద్యార్థుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకొని నూతనత్వాన్ని జోడించేలా సిద్ధం చేయాలి. –ఇమంది శ్రీనివాస్, ఎంఈవో–1 పెదగంట్యాడ,

అన్ని పాఠశాలల నుంచి..

మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి విద్యార్థులను ఇన్‌స్పైర్ మనక్-2025లో పాల్గొనేలా చూడాలి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పడేలా విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించేలా ప్రోత్సహించాలి. దీనిని సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించి, విద్యార్థుల ఆలోచనకు మరింతగా పదును పెట్టాలి.

–కంకటాల రమణాజీ, ఎంఈవో–2, పెదగంట్యాడ

ప్రతి పాఠశాల నుంచి ..

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ నమోదుకు సెప్టెంబర్–15వ తేదీ వరకూ గడువు ఉంది. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు భాగస్వాములు కావాలి. ఉన్నత పాఠశాలల విద్యార్థుల నుంచి 5 ప్రాజెక్టులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి. – రాజారావు, జిల్లా సైన్స్ అధికారి

13 నుంచి టెక్నికల్ ఫెస్ట్

అగనంపూడి: విద్యార్థుల్లో సృజనాత్మకతను మెరుగుపర్చడానికి జాతీయ స్థాయిలో టెక్నికల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. ఇంజినీరింగ్ డేను పురస్కరించుకొని దువ్వాడ విజ్ఞాన్ కళాశాల ఆధ్వర్యంలో వచ్చేనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఫెస్ట్‌లో హ్యాక్‌థాన్, ఐడియా థాన్, యాప్ డిజైన్, సర్క్యూట్రిక్స్, రోబోరేస్ మరియు ప్రాజెక్టు ఎక్స్‌పో, డ్రోన్ కాంపిటేషన్ వంటి అంశాల్లో ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలకు నగదు పారితోషికం అందివ్వనున్నాన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఫెస్ట్ కన్వీనర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజు తగ్గించాలని వినతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ ఫీజు తగ్గించాలని రైల్వేజోనల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ తూర్పు కోస్తా రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ రీటా రాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. భువనేశ్వర్‌లోని ఆమె కార్యాలయంలో కలిసి దువ్వాడ, విశాఖపట్నం రైల్వేస్టేషన్ల సమస్యలపై చర్చించారు.

ఏ రైల్వేస్టేషన్‌లో లేనివిధంగా దువ్వాడలో పార్కింగ్ ఫీజులు ఉన్నాయని వివరించారు. అలాగే విశాఖ– పూరీ, నర్సాపురం వయా విశాఖపట్నం మీదుగా సంబల్‌పూర్‌కు రైలు సర్వీస్ నడపాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాజువాక:గాజువాక ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం మరమ్మతులు నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా తోకాడ, విశ్వేశ్వరయ్యనగర్, శ్రీరామ్‌నగర్, ఇండస్ట్రియల్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యాబోధన



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

అగనంపూడి: విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ పనితీరు మార్చుకోవాలని, మార్పులను స్వాగతిస్తూ విద్యా బోధన చేయాల్సి ఉంటుందని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. లంకెలపాలెంలో నిర్వహించిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ హ్యాండ్‌బుక్‌తో ఉపాధ్యాయుల పనితీరు తెలుస్తుందని, అలాగే అసెస్‌మెంట్ పుస్తకం ప్రతీ విద్యార్థి తరగతి ఆరంభంలో ఏడాది ముగింపులో వచ్చిన మార్పును స్పష్టం చేస్తుందన్నారు. అన్ని పరీక్షలకు ఒక పుస్తకం ఉండడం వల్ల విద్యార్థుల ప్రగతికి అద్దం పడుతుందన్నారు. అలాగే ఎఫ్ఎ-1 పరీక్షలను మూల్యాంకనం చేసి మార్కులను వెంటనే ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ఎస్.వి.ఆర్.మూర్తి, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, శ్రీనాథ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం రేషన్ కార్డుల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

గాజువాక: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.బాబూరావు తెలిపారు. 'రేషన్ కార్డుల పంపిణీలో గందరగోళం' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. వర్షాలు, వినాయక చవితి కారణంగా స్మార్ట్ కార్డుల పంపిణీ కొంత ఆలస్యమైందన్నారు. ఇకపై యథావిధిగా పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. గాజువాక జోన్‌కు 69,387 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడం కోసం వీఆర్వోలకు అందజేశామని తెలిపారు. చాలామంది పోర్టబులిటీద్వారా వేరే ప్రదేశాల్లో డీలర్ల వద్ద సరుకులు తీసుకోవడంవల్ల తమ కార్డుకి సంబంధించిన సమాచారం తెలుసుకోవడం కోసం సమీపంలో ఉన్న సచివాలయాలకు వెళ్తున్నారన్నారు. కార్డుదారులు వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి స్మార్ట్ రైస్ కార్డు నంబర్ నమోదు చేస్తే కార్డుకు సంబంధించిన రేషన్‌షాప్ నంబర్, సచివాలయం తెలుస్తుందని పేర్కొన్నారు. ఇదిలాఉండగా గాజువాక సర్కిల్–3 పరిధిలో వీఆర్వోల ద్వారా 25,974 కార్డులు పంపిణీ చేశామన్నారు. 65 ఏళ్ల దాటిన వారికి సర్కిల్–3లో 8388 కార్డులకు గాను ఇప్పటివరకు 993 కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం : సింహగిరిపై పారిశుధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం శానిటేషన్ అధికారులను ఈవో వి.త్రినాథరావు ఆదేశించారు. సింహగిరిపై ఏ ప్రదేశంలోనూ అపరిశుభ్ర వాతావరణం కనిపించకూడదని, భక్తుల నుంచి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. సింహగిరిపై శనివారం ఆయన పలు ప్రదేశాల్లో పారిశుధ్య పనులు ఏవిధంగా జరుగుతున్నాయో పరిశీలించారు. ప్లాస్టిక్ రహితంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఉండాలన్నారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాన్ని పరిశీలించి... ఇక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు కొత్త డిజైన్ తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా దాతల సహకారంతో నిర్మిస్తున్న షెడ్ పనులను పరిశీలించారు. చందనోత్సవం రోజు కూలిపోయిన రిటైనింగ్‌వాల్ వద్ద మెట్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. విజయదశమికి స్వామి ఆ మార్గంలోనే కొండ దిగువకు వెళ్తారని తెలిపారు.

సమ్మిళిత విద్యను చేరువ చేయాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : సమ్మిళిత విద్య చేరువ చేసేందుకు కృషి చేయాలని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, అలగప్ప యూనివర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్ రిహాబిలిటేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య సుజాత మాలిని సూచించారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి శనివారం ఆమె వర్చువల్‌గా ప్రసంగించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్‌లు ఏర్పాటు కావాలని, కరికులంలో సరళత ఉండాలని ఆమె సూచించారు. నూతన విద్యా విధానం అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించిన విధానాన్ని వివరించారు. ప్రత్యేక విద్యను బోధించే వారు నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ విద్య విధానం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విభిన్న ప్రతిభావంతులను సాధారణ వ్యక్తులతో సమానంగా తీర్చిదిద్దాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడు రోజులపాటు కంటిన్యూయింగ్ రీహాబిలిటేషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ప్రకాష్ల రచించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అండ్ మల్టిపుల్ డిజేబిలిటీస్ పుస్తకాన్ని వీసీ రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజ కుమార్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ దేవి, డాక్టర్ రాము పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



ఉక్కు ఎఫ్ఎండీ విభాగ ఉద్యోగి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వివిధ హోదాల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్టీల్‌ప్లాంట్ నుంచి ఈనెలలో 160 మంది పదవీ విరమణ చేయనున్నారు. నెలాఖరు ఆదివారం కావడంతో అన్ని విభాగాల్లో శనివారమే ఆయా ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వారికి సర్వీసు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వారి భవిష్యత్తు అవసరాల కోసం మెడికల్ బుక్స్, రిటైర్డ్ ఐడెంటిటీ కార్డులు అందజేశారు. సహోద్యోగులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఫీల్డ్ మిషనరీ విభాగం (ఎఫ్ఎండి) డీజీఎం రతన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముగ్గురు ఉద్యోగులకు, ఇంజనీరింగ్ షాప్స్‌లో డీజీఎం ముఖోపాధ్యాయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరుగురు ఉద్యోగులకు వీడ్కోలు పలికారు. ఒకేరోజు అంత మంది పదవీ విరమణ చేయడంతో ఆయా విభాగాల్లో పదవీ విరమణ ఉద్యోగుల కుటుంబీలతో సందడి నెలకొంది.

వృత్తి నైపుణ్యం పెంపుదలపై వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న షిప్‌యార్డ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో పని చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సహకారంతో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఎండీ సింగ్, సీఎండీ రాకేష్‌ప్రసాద్ ప్రారంభించారు. ఉద్యోగులు పనిచేస్తున్న విభాగాల్లో ఏ విధంగా నాయకత్వ లక్షణాలను వృద్ధి చేసుకోవాలి, వ్యూహాత్మక ఆలోచనతో ఏ విధంగా ముందుగా వెళ్లాలి, ఉత్తమ పద్ధతుల అన్వేషణ వంటి అంశాలను వివరించారు.

బీచ్ కబడ్డీ పోటీల విజేత చంద్రంపాలెం



బీచ్ కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న వారియర్స్ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. గోపాలపట్నం ఎస్వీఎల్ఎన్‌జెడ్ హైస్కూల్ జట్లు రన్నరప్ సాధించాయి. విజేతలకు ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ జట్టు సభ్యులు ట్రోఫీలను అందజేశారు. ఆ జట్టు కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్ కుమార్ పాల్గొని.. ఆటను ఎలా మెరుగుపరుచుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగే తమ మ్యాచ్‌ను వీక్షించేందుకు వారికి ఆహ్వానం పలికారు.

వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు



యాతపాలెంలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ధర్మాల శ్రీనివాసరావు



వడ్లపూడిలో వడ్డన చేస్తున్న ఇల్లపురాము తదితరులు



శ్రీరాంనగర్‌లో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కోమటి శ్రీనివాస్

కూర్మన్నపాలెం: వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు నిర్వహించారు. వడ్లపూడి శ్రీరాంనగర్‌లో నిర్వహించిన భారీ అన్నసమారాధనను 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన ముందుగా గణనాథునికి పూజలు చేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణ, నాగేశ్వరరావు, గాయత్రి, అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వడ్లపూడిలో జరిగిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, పి.వేణుబాబు, బి.తాతారావు తదితరులు పాల్గొన్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెంలో భూలోకమాంబ యూత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్నసమారాధన లో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సంపంగి ఈశ్వరరావు, యూత్ సభ్యులు పైడిరాజు, జగదీష్, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో కుక్కల హల్‌చల్

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు



ప్రయాణికుల లాంజ్‌లోని చైర్‌పై నిద్రిస్తున్న శునకం

సాక్షి, విశాఖపట్నం: టికెట్ తీసుకోవు.. బోర్డింగ్ పాస్ అవసరం లేదు.. ఎక్కడికంటే అక్కడికి వెళ్లిపోతున్నాయి.. ఎయిర్‌పోర్టును ఆక్రమించేస్తున్నాయి. వైజాగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శునకాలు స్పెషల్ ఎంట్రీ ఇస్తున్నాయి. ప్రయాణికులు సేద తీరాల్సిన చైర్లపై శయనిస్తున్నాయి. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో కుక్కలను చూసి.. ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. లాంజ్‌లోకి శునకాలు వచ్చేంత వరకూ ఎయిర్‌పోర్టు అధికారులు ఎలా నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. గతేడాది కాలంగా విశాఖ విమానాశ్రయంలో పరిశుభ్ర వాతావరణం లోపిస్తోందంటూ ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఎయిర్‌పోర్టు పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పెందుర్తి: సమాజంలో పోటీ తత్వం పెరిగిపోవడం, ఇతరత్ర అంశాలపై అనేక మంది మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని వాసవీ మహిళా మండలి కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వై.గోపీచంద్ అన్నారు. పెందుర్తి మండలంలో పలు ప్రాంతాల్లో మానసిక ఒత్తిడి–మానసిక రుగ్మతల నివారణ అంశంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని ప్రతి ఒక్కరూ మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి తగిన చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.